రాష్ట్ర వ్యాప్తంగా 395 మంది ఎంపిడిఒల బదిలీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పెద్ద సంఖ్యంలో ఎంపిడిఒలను ప్రభుత్వం బదిలీ చేసింది. ఒకే సారీ 395 మందికి స్థాన చలనం కలిగించింది. ఈ మేరకు పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్ సర్క్యులర్ జారీ చేశారు. జిల్లా కలెక్టర్లు బదిలీ అయిన ఎంపిడిఒలను ఈ నెల 12న రిలీవ్ చేసి, 13న కొత్తవారు బాధ్యతలు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 2024లోకసభసాధారణఎన్నికలను పురస్కరించుకుని సొంత జిల్లాలో పనిచేస్తున్న వారితో పాటు, మూడేండ్లుగా ఒకే చోట విధులు నిర్వహిస్తున్న వారిని బదిలీ చేయాలని గత డిసెంబర్‌లో కేంద్ర ఎన్నికల సంఘం అన్ని రాష్ట్రాలను ఆదేశించింది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో బదిలీల పరంపర కొనసాగుతోంది. మరో రెండు, మూడు రోజుల్లో రాష్ట్రంలో ఇతర శాఖల్లో సైతం ఎన్నికల నియమావళి ప్రకారం భారీ సంఖ్యలో బదిలీలు జరగుతాయిన ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

సందిగ్ధ పరిస్థితుల్లో డిగ్రీ కాంట్రాక్ట్ లెక్చరర్లు

- ఎం వినోద్ కుమార్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోని డిగ్రీ కాంట్రాక్ట్ లెక్చరర్లు సంధిగ్ధ పరిస్థితిలో ఉందని తెలంగాణ డిగ్రీ కాంట్రాక్ట్ లెక్చరర్ల అధ్యక్షులు ఎం వినోద్ కుమార్ తెలిపారు. ఈ స్థితిలో పెండిగ్ వేతనాలు మంజూరు చేసిన కమిషనర్ బుర్ర వెంకటేశం, సిసిఇ అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సెప్టెంబర్ నుంచి నవంబర్ వరకు మూడు నెల్ల వేతనాలు ఇవ్వ లేదని తెలిపారు. వాటిని చెల్లించే విధంగా ఫైనాన్స్ సెక్రటరీకి ఆదేశాలివ్వాలని కోరారు.

భిన్న కళా ప్రక్రియల వేదిక హైదరాబాద్ జిందాబాద్

ప్రజాశక్తి - కల్చరల్

భిన్న సంస్కృతులు సంప్రదాయాలు విభిన్న కళా ప్రక్రియలు ప్రతీక హైదరాబాద్ కాగా ఆదివారం రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై ఆ కళలన్నీ కలబోసి ఒకే చోట అవిష్కృతం ఇనాయి. భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో హైదరాబాద్ సిటిజన్స్ ఫోరం, హైదరాబాద్ జిందాబాద్ సాంస్కృతిక సమ్మేళనం ఆద్యంతం ఆసక్తికరంగాను కన్నుల పండువగా జరిగింది. బోర్ కొట్టించే సుదీర్ఘ ప్రసంగాలు లేవు. ఒకరు ప్రస్తుతి చేదుకివటాలూ కూడా లేవు. సాంస్కృతిక సమ్మేళనం అంటే పూర్తి కళల సమాహార మే. సుమారు 170 పైగా ఐదేళ్ల వయస్సు నించి డెభై పైబడిన కళాకారులు ఎంతో ఉత్సాహంగా పదహారు కళా రూప ప్రదర్శనలో పాల్గొన్నారు. ఓం డాన్స్ అకాడెమీ బాలలు ప్రదర్శించిన సైనికుల దేశభక్తి నృత్య సహిత సందేశ రూపకం ప్రేక్షకులకు అచ్చెరువు కలిగించింది. పేరడీ గురుస్వామి పేరడీ పాటలు నవ్వులు పండిచాయి. కుందనిక కథక్ నృత్యం కేరళ జానపద నత్యాలు అన్సారీ ఖవ్వాలీ పాటలు వహ్వా అనిపించాయి. నరేష్ సంపత్‌ల మిమిక్రీ, చోక్కపు రమణ మేజిక్ అబ్బుర పరిచాయి. సైదులు నిర్వహణలో పలు విద్య సంస్థల విద్యార్థులు నాట్యాలు ఆకట్టుకున్నాయి. అతిథులుగా సీనియర్ జర్నలిస్ట్ పాశం యాద గిరి నటుడు ఘర్షణ శ్రీనివాస్ రావు, డాక్టర్ ప్రత్యూష స్వప్న కిషోర్ జయ సూర్య డాక్టర్ శ్రీనివాస్ రాజీవ్ కుమార్ కిరణ్ కుమార్ రెడ్డితదితరులు పాల్గొని కళాకారులను అభినందించారు. సంస్థ అధ్యక్షుడు ఎన్ అంజయ్య కార్యదర్శి కె వీరయ్య సంయుక్త కార్యదర్శిశ్రీనివాస్‌లు మాట్లాడుతూ హైదరాబాద్ జిందాబాద్ గత ఎనిమిది సంవత్సరాలుగా పర్యావరణ సమస్యలపై అవగాహన పేదలకు వైద్యం కోసం మెడికల్ క్యాంపులు నిర్వహించటం చేస్తోందని తెలిపారు. ప్రముఖ మిమిక్రీ కళా కారుడు మల్లం రమేష్ వ్యాఖ్యాతగా కార్యక్రమం సమర్థవంతంగా చేశారు.

ప్రతిపక్షంపై దూకుడే...

- ప్రాజెక్టులపై ప్రజాభవన్‌లో పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్
- నేడు అసెంబ్లీలో సాగునీటి ప్రాజెక్టులపై శ్వేతపత్రం
- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సిఎం రేవంత్ దిశానిర్దేశం

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

అసెంబ్లీలో ప్రతిపక్షంపై దూకుడుగానే వ్యవహరించాలనీ, ఎట్టి పరిస్థితుల్లో అధికారపార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సబ్జెక్ట్ విషయంలో తడబడవద్దని ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. బిఆర్‌ఎస్ హయాంలో రాష్ట్రంలో నిర్మించిన సాగునీటి ప్రాజెక్టులపై సోమవారం శాసనసభలో శ్వేతపత్రం ప్రకటించనున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మంత్రులు, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలకు సాగునీటి ప్రాజెక్టులపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు కూడా దీనిలో పాల్గొన్నారు. ప్రాజెక్టుల డిజైన్, దానిలోని లోపాలు, రీ డిజైనింగ్ పేరుతో మార్పులు, అంచనా వ్యయం, ఆ తర్వాత పెంచిన వ్యయం, ఆయా ప్రాజెక్టుల నిర్మాణం వల్ల సాగులోకి వచ్చిన భూమి ఎంత? ప్రాజెక్టుల డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్టు (డిపిఆర్)లో ఏమని పేర్కొన్నారు? దానికి భిన్నంగా నిర్మాణాలు ఎలా చేశారు? నిర్మాణాల్లోని నాణ్యత, ఏపి ప్రాజెక్టుల్లో ఎంత అవినీతి జరిగింది అనే అంశాలపై వారికి అవగాహన కల్పించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా అసెంబ్లీలో వ్యవహరించాల్సిన వ్యూహాన్ని కూడా వివరించారు. అలాగే కృష్ణా నదిపై ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించే విషయంలో నెలకొన్న వివాదంపైనా ప్రజాప్రతినిధులకు స్పష్టత ఇచ్చారు. గడచిన పదేండ్లలో కెసిఆర్ ప్రభుత్వమే కృష్ణా ప్రాజెక్టులను బోర్డుకు అప్పగిస్తామని కేంద్ర సమావేశాల్లో సంతకాలు చేసి రావడం, రాష్ట్రంలో అందుకు భిన్నంగా కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదచల్లే ప్రయత్నం చేయడం వంటి పలు అంశాలపై సుదీర్ఘ చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు ఎవరెవరు ఏఏ అంశాలు మాట్లాడాలో కూడా వారికి దిశానిర్దేశం చేశారు. అలాగే 13న కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజ్‌ను సిఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సందర్శించనున్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపక్షనేత కె చంద్రశేఖరరావు సహా బిఆర్‌ఎస్, బిజెపి, ఎంఐఎం ఎమ్మెల్యేలను కూడా మేడిగడ్డకు రావాలని ఆహ్వానించిన విషయం తెలిసిందే.

కెసిఆర్‌వి సెంటిమెంట్ రాజకీయాలు
ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

కృష్ణా జలాలపై సోమవారం అసెంబ్లీలో స్పష్టత ఇస్తామని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య చెప్పారు. ప్రజా భవన్‌లో ప్రాజెక్టులపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ అనంతరం ఆయనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. మంగళవారం నల్గొండలో మాజీ సిఎం కెసిఆర్ మీటింగ్ మొదలయ్యేలోపు తెలంగాణ ప్రజలకు నిజాలు చెప్పేస్తామన్నారు. ఏపి సిఎం జగన్ కోసం కెసిఆర్ తెలంగాణ నీళ్లను ఆంధ్రప్రదేశ్‌కు తరలించారనీ, ఇప్పుడు సెంటిమెంట్ వాడుకుందామని చూస్తే ప్రజలు బుద్ధి చెప్తారని విమర్శించారు. ప్రజల్లో సెంటిమెంట్ రగిల్చి ఓట్లు కొల్లగొట్టడంలో కెసిఆర్ దిట్ట అనీ, ఎన్నికల్లో ఓట్ల కోసం పోలింగ్ రోజు డ్రామాలు చేశారనీ, ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో దోచుకున్న నిధుల్ని ఎన్నికలకు వాడుతున్నారని ఆరోపించారు.

రేపు మేడిగడ్డకు రానున్న సిఎం రేవంత్‌రెడ్డి !

- మంత్రులు ఎమ్మెల్యేలతో కలిసి బ్యారేజీ పరిశీలన
- ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్

మేడిగడ్డ బ్యారేజీని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ తదితరులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఈ నెల 13న మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం మేడిగడ్డ బ్యారేజీ పరిశీలనకు రానున్నారు. ఎమ్మెల్యేలతో కలిసి మేడిగడ్డ బ్యారేజీ పరిశీలనకు వెళుతున్నట్టు సిఎం అసెంబ్లీలో ప్రకటించిన నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి, అక్రమాలపై కొత్త ప్రభుత్వం దృష్టి పెట్టింది. సిఎం, ఎమ్మెల్యేల పర్యటన నేపథ్యంలో మేడిగడ్డ వద్ద భారీ భద్రత ఏర్పాట్లకు జిల్లా కలెక్టర్‌తోపాటు ఎస్‌పి నుంచి పోలీసులకు ఆదేశాలందాయి. మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీవద్ద అన్ని శాఖల ఆధ్వర్యంలో ఏర్పాట్లను ఆదివారం ప్రారంభించారు. రాష్ట్ర ఆర్‌అండ్‌బి శాఖ ఇఎన్‌సి పర్యటించి పనులను పురమాయించారు. హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గంగ్గా మేడిగడ్డక్డ బస్సులలో వస్తుండటంతో రహదారి ని మరమ్మతులు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆదివారం సాయంత్రం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అన్ని శాఖల అధికారులతో మేడిగడ్డ వద్ద చేయాల్సిన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

- ఎన్‌ఎంఓపిఎస్ సెక్రటరీ జనరల్ స్థిత ప్రజ్ఞ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో సిపిఎస్ ఉద్యోగుల కంట్రిబ్యూషన్‌ను తక్షణం నిలిపివేసి, పాత పెన్షన్ విధానం అమలు దిశగా అడుగులు వేయాలని నేషనల్ మూమెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం జాతీయ ప్రధాన కార్యదర్శి సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 9న పబ్లిక్ గ్రౌండ్ రంగ్‌పోలో జరిగిన రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సదస్సు లో సిక్కిం ముఖ్యమంత్రి ప్రేమ్ సింగ్ తమాంగ్ ఏప్రిల్ 1,2006 నుంచి నియమితులైన వారికి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తున్నట్లు ఈశాన్య రాష్ట్రాల్లో పాత పెన్షన్ పునరుద్ధరించిన మొదటి రాష్ట్రంగా సిక్కిం అవతరించిందని తెలిపారు. ఈ సమావేశంలో తెలంగాణ సిపిఎస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేష్ గౌడ్‌లు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో శిశువు మృతి..

- వైద్యురాలి నిర్లక్ష్యమే కారణమంటూ ఆందోళన

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం నగరంలోని లుంబిని ఆస్పత్రిలో ప్రసవానంతరం ఓ శిశువు ఆదివారం చనిపోయింది. తల్లి గర్భంలో శిశువు మెడకు పేగు పెనవేసుకుని ఉంటే ఆపరేషన్ చేసి ప్రాణం పోయకుండా ఖమ్మంలోని వైద్యులు సాధారణ ప్రసవం పేరుతో జాప్యం చేయడంతో శిశువు మృతిచెందిందని బాధిత కుటుంబీకులు ఆరోపించారు. వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. బాధిత కుటుంబీకులు చెప్పిన వివరాల ప్రకారం..ఖమ్మంరూరల్ మండలం గుర్రాలపాడుకు చెందిన శ్రీదేవి, యాకన్న దంపతులకు ఐదేళ్ల తర్వాత సంతానం అందింది. ఆదివారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో శ్రీదేవికి పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు ఖమ్మం రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న లుంబిని ఆస్పత్రికి తీసుకొచ్చారు. అయితే, ఆ సమయంలో వైద్యురాలు లేకపోవడంతో నర్స్ ఫస్ట్‌ఎయిడ్ చేసింది. డాక్టర్‌కు గర్భిణీ పరిస్థితి తెలిపారు. డాక్టర్ రావడం ఆలస్యం కావడంతో నర్స్‌నే ప్రసవం చేసింది. అయితే, శిశువు పల్స్ పడిపోయినా నర్స్ విషయం చెప్పకుండా వెళ్లిపోయింది. ఆ తర్వాత శిశువు మృతిచెందిందని కుటుంబీకులు కన్నీటి పర్యంతమయ్యారు. శిశువు మృతికి వైద్యురాలి నిర్లక్ష్యమే కారణమని ఆరోపిస్తూ, ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో తమకు న్యాయం చేయకపోతే ఆత్మహత్య చేసుకుంటానంటూ శ్రీదేవి సోదరుడు పెట్రోల్ పోసుకునే ప్రయత్నం చేయడంతో పోలీసులు అడ్డగించారు.

వార్తలు చదివేవారికి భాషా ఉచ్చారణ స్పష్టంగా వుండాలి

- జస్టిస్ రామలింగేశ్వర రావు

ప్రజాశక్తి కల్చరల్

తెలుగు టెలివిజన్ చానల్స్‌లో వార్తలు చదివేవారికి భాషా ఉచ్చారణ స్పష్టంగా ఉండాలని సమైక్య ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం విశ్రాంత న్యాయ మూర్తి జస్టిస్ రామలింగేశ్వరరావు అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై ప్రముఖ సాంస్కృతిక సంస్థ ఆరాధన నిర్వహణలో వివిధ తెలుగు చానల్స్‌లోని న్యూస్ ప్రెజెంటర్లకు పురస్కార ప్రదాన సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న జస్టిస్ రామలింగేశ్వరరావు పాల్గొని టివి 5 సృజన, టివి 9 శ్రీలత, దూరదర్శన్ యాదగిరి గౌతం కుమార, సప్తగిరి జె సరోజ, 10 టివి ధన లక్ష్మి, సాక్షి రవళి, ఎబిఎన్ నవీన్ కుమార్ తదితర చానల్స్‌తో యూ ట్యూబ్ చానెల్ వారికి పురస్కారాలు బహూకరించి జస్టిస్ రామలింగేశ్వరరావు మాట్లాడారు. వార్తలు చదివేవారు ఆహార్యం భావ ప్రకటనలో జాగ్రత్తలు పాటించాలని కోరారు. కళా పోషకుడు జి హనుమంతరావు అధ్యక్షత వహించిన సభలో పారిశ్రామిక వేత్త విజయ లక్ష్మి కాంగ్రెస్ నాయకులు ఇందిర రెడ్డి యువ కళా వాహిని లంక లక్ష్మీనారాయణ చిల్ల రాజశేఖర్ రెడ్డి సాహితీ వేత్త లంక లక్ష్మి నారాయణ తదితరులు పాల్గొన్న సభకు సంస్థ స్థాపకుడు లోకం కృష్ణయ్య స్వాగతం పలికారు. ఈ సందర్భంలో టివి న్యూస్ ప్రెజెంటర్ జీవిత సాఫల్య పురస్కారాలు పి నిర్మల, బి రమణ బాబు, భారత్ రెడ్డిలకు వీర భోగ వసంత రాయలు విజయ లక్ష్మి సౌజన్యంతో ముఖ్య అతిథి బహుకరించారు. లలితారావు సమర్పణలో తెలుగు హిందీ చిత్ర గీతాలు ఆకట్టుకున్నాయి.

'సాగునీటి' అవకతవకలపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దశాబ్ద కాలంగా సాగునీటి ప్రాజెక్టులపై లక్షల కోట్లు వ్యయం చేసినప్పటికీ ఆశించిన ఫలితాలు రాలేదనీ, వాటి నిర్మాణంలో జరిగిన అవకతవకలను పరిశీలించటానికి అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సిపిఎం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ప్రభుత్వానికి ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో ఏర్పడిన తెలంగాణ ప్రభుత్వం, నీటి వనరుల నిర్మాణానికి ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చి, ప్రతి నియోజకవర్గంలో లక్ష ఎకరాల ఆయకట్టుకు సాగునీటి వసతిని కల్పిస్తామని చెప్పారని గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పడే నాటికి 43 లక్షల ఎకరాల్లో సాగునీటి వనరులు కల్పించబడ్డాయని పేర్కొన్నారు.రాష్ట్రంలో సాగు భూమి కోటీ 63 లక్షల ఎకరాలు ఉన్నదని తెలిపారు. గత ప్రభుత్వం పాలమూరు ఎత్తిపోతలను, ప్రాణహిత-చేవెళ్ల, రాజీవ్‌సాగర్, ఇందిరాసాగర్ ప్రాజెక్టులను రీ-డిజైన్ చేసిందని పేర్కొన్నారు. రీ-డిజైన్‌తో అంచనా వ్యయం రెట్టింపైందని తెలిపారు. ప్రాణహిత-చేవెళ్లను కాళేశ్వరంగా రీ-డిజైన్ చేయడంతో రూ.38,500 కోట్లుగా వున్న అంచనా రూ.1.15 లక్షల కోట్లకు పెరిగిందని తెలిపారు. అయినప్పటికీ, ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకల వల్ల కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం ప్రాజెక్టులు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. కన్నెపల్లి పంపు హౌజ్ వద్ద రక్షణ గోడ కూలి 17 బాహుబలి పంపులు నీట మునిగాయని తెలిపారు. ఇప్పటికీ రిపేర్లు కాలేదని పేర్కొన్నారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి చెందిన ఎనిమిది పంపులు శ్రీశైలంలో నీట మునిగాయనీ, నదీ జలాల వినియోగంపై ప్రభుత్వం ప్రకటించిన దానికి భిన్నంగా వేల కోట్ల నష్టం వాటిల్లిందని ఆందోళన వ్యక్తం చేశారు.

గుట్టపైకి ఆటోల రాకపోకలను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

మాట ఇచ్చా.. నిలబెట్టుకున్నా

- యాదగిరిగుట్టపైకి ఆటోల ప్రారంభంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమ ప్రభుత్వం వచ్చాక ఆటోలను కొండపైకి అనుమతిస్తామని ఎన్నికల ముందు ఆటో కార్మికులకు హామీ ఇచ్చానని, ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటున్నానని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య తెలిపారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట లక్ష్మీనర్సింహస్వామి కొండపైకి ఆటోల రాకపోకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుట్టను అభివృద్ధి చేస్తే ఉపాధి దొరుకుతుందనుకుంటే వెయ్యి కుటుంబాల్ని గత ప్రభుత్వం చిందరవందర చేసిందని ఆరోపించారు. వారిలో ఆటో కార్మికులూ ఉన్నారన్నారు. తనపై నమ్మకంతో పట్టణంలో 80శాతం మంది ఓట్లు వేశారని, వారి రుణం తీర్చుకునేందుకు ఎంత దూరమైనా వెళ్తానన్నారు. అందులో మొదటి అడుగుగా కొండపైకి ఆటోలు వెళ్లడాన్ని తీసుకుంటున్నా నన్నారు. కొండపైకి ఆటోలు ప్రారంభంకావడంతో సుమారు 400 కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోందని చెప్పారు. దుకాణాలు కోల్పోయిన వారికి 140 మందికి ప్లాట్లు పంచామన్నారు. సందర్శకుల ఇబ్బందులు తీర్చడానికి రూ.20కోట్లతో డార్మెంటల్ నిర్మాణం చేపడుతున్నామ న్నారు. కొబ్బరికాయ కోట్టేందుకు స్థలాలను ఏర్పాటు చేశామని, టాయిలెట్లు, బాత్రూంలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొండపైన షాపులను పెంచేందుకూ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ హనుమంత్ జే జెండగె, డిసిపి రాజేష్‌చంద్ర, అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి, దేవస్థానం ఇఒ రామకృష్ణారావు, అనువంశిక ధర్మకర్త నర్సింహామూర్తి, కాంగ్రెస్ నాయకులు అండం సంజీవరెడ్డి, బండ్రు శోభారాణి, జనగాం ఉపేందర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎరుకల సుధాహేమేందర్‌గౌడ్, ఎంపిపి చీర శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ల పై సస్పెన్షన్ ఎత్తేయాలి

- టిటిజిడిఎ డిమాండ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కామారెడ్డి జిజిహెచ్‌లో రోగులను ఎలుకలు కరిచిన వ్యవహారంలో డిఎంఇ విభాగ డాక్టర్లపై సస్పెన్షన్ ఎత్తేయాలని తెలంగాణ టీచింగ్ గవర్నమెంటు డాక్టర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. డాక్టర్లను అన్యాయంగా సస్పెండ్ చేయడం సరైంది కాదని పేర్కొంది. ఈ మేరకు ఆదివారం సంఘం అధ్యక్షులు డాక్టర్ అన్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ తిరుపతిరావు, కోశాధికారి కిరణ్ ప్రకాశ్, ఉపాధ్యక్షులు కిరణ్ మాదాల, డాక్టర్ ప్రతిభా లక్ష్మి ఒక ప్రకటన విడుదల చేశారు. డాక్టర్లు రోగికి వైద్యం చేయడం వరకే బాధ్యత ఉంటుందని పేర్కొన్నారు. ఆస్పత్రిలో ఎలుకలు, కుక్కలు, పందులు, కీటకాలు ఉండకుండా చూడటం సానిటేషన్ సిబ్బంది, అధికారుల బాధ్యత అని గుర్తు చేశారు. డాక్టర్ల సస్పెన్షన్‌కు నిరసనగా రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. అన్ని ప్రభుత్వ కళాశాలల్లో సోమవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేయాలని వారు కోరారు.

ఆర్‌టిసికి 'మహా'లక్ష్మి

- ఉచితంతో గణనీయంగా పెరిగిన ప్రయాణికులు
- సున్నా టికెట్‌తో ఆర్‌టిసి ఆదాయంలోనూ పెరుగుదల
- ఖమ్మం రీజియన్‌కు గతం కంటే రెట్టింపు ఆదాయం
- మిగతా చోట్ల అదే ఆదరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉచిత బస్సు ప్రయాణం మహిళలతోపాటు టిఎస్‌ఆర్‌టిసికి సైతం వరంలా మారింది. మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం ప్రారంభానికి ముందు తరువాత చూస్తే ఆర్‌టిసికి రెట్టింపు స్థాయిలో ఆక్యుపెన్సీ రేషియో పెరిగింది. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో పెట్టిన అధికారంలోకి వచ్చిన తరువాత మహాలక్ష్మి పథకంలో ఒక్కటైన ఆర్‌టిసి బస్సుల్లో మహిళల ఉచిత ప్రయాణాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఉచిత ప్రయాణంతో ఆర్టీసికి కూడా ఎలాంటి నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం మహిళలకు సున్నా టికెట్ ఇస్తోంది. దీని ప్రకారం ఎంత మంది మహిళలు ఉచిత ప్రయాణాన్ని ఉపయోగించుకున్నారో దానికి అనుగుణంగా ప్రభుత్వం టిఎస్‌ఆర్‌టిసికి ఆ మొత్తాన్ని చెల్లించేలా ఈ పథకాన్ని రూపొందించారు. మహిళల ఉచిత బస్సు ప్రయాణ పథకానికి విశేష స్పందన లభిస్తోందని పలువురు తెలిపారు. తొలుత ఈ పథకంపై విమర్శలు వచ్చినా.. పురుష ప్రయాణికులు కొంతమేర ఇబ్బంది పడినా..ముఖ్యంగా ఆటో డ్రైవర్ల రోజువారీ ఆదాయానికి గండిపడినా.. సోషల్ మీడియాలో రకరకాల విమర్శనాత్మక వీడియోలు వెలువడినా.. ప్రభుత్వం మాత్రం ఈ పథకం విషయంలో వెనక్కి తగ్గలేదు. ఆటో కార్మికులు, యూనియన్‌లు ఆందోళనలు చేపట్టిన నేపథ్యంలో వారికి సైతం రూ.12 వేలు ఇచ్చేందుకు ప్రభుత్వం మొగ్గు చూపింది. ఈ పథకంతో ఆర్‌టిసి ప్రయాణికుల సంఖ్య పెరిగిన దృష్ట్యా సరిపడా బస్సులను ఏర్పాటు చేయాలనే డిమాండ్లు సైతం ముందుకొచ్చాయి. అంతేకాక బస్సుల వైపు నుంచి కూడా అవరోధాలు ఏర్పడ్డాయి. వీటన్నింటినీ అధిగమిస్తూ మహిళల ఉచిత ప్రయాణాన్ని ప్రభుత్వం కొనసాగిస్తోంది. అయితే, ఈ స్కీం ఉద్దేశాన్ని తెలుసుకొని స్వతహాగా చాలామంది ఆర్థికంగా ఉన్న మహిళలు ఉచిత ప్రయాణానికి దూరంగా ఉంటున్నారు.

పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని అనుమతిస్తున్నారు. గుర్తింపు కార్డు చూపించి జీరో టికెట్ తీసుకుని ప్రయాణించేలా నిబంధనల్లో మార్పు తెచ్చారు. ఎవరైనా జీరో టికెట్ తీసుకోకుండా బస్సులో ప్రయాణిస్తే రూ. 500 వరకు జరిమానా విధించేలా రూల్స్‌లో మార్పు తెచ్చారు. మహిళా సాధికారత పెంపుదలకు ఈ పథకం ఎంతగానో ఉపకరిస్తుందని మహిళా సంఘాలు అంటున్నాయి. నిరుపేదలు, మధ్యతరగతి మహిళలు అత్యధికంగా ఈ ఉచిత ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకుంటున్నట్టు ఆర్టీసి వర్గాలు చెబుతున్నాయి.

ఉచితంతో పెరిగిన ప్రయాణం..

రాష్ట్రవ్యాప్తంగా మహిళల ఉచిత బస్సు ప్రయాణంతో దాదాపు అన్ని రీజియన్లలోనూ ఆదాయం భారీగా పెరిగినట్టు గణాంకాలు చెబుతున్నాయి. స్కీమ్ ప్రవేశ పెట్టిన నాటి నుంచి ఫిబ్రవరి ఆరు వరకు దాదాపు 15 కోట్ల మంది ఉచిత బస్సు ప్రయాణాన్ని ఉపయోగించుకున్నారు. ఖమ్మం రీజియన్ పరిధిలో ఖమ్మం, మధిర, సత్తుపల్లి, భద్రాచలం, కొత్తగూడెం, మణుగూరు, ఇల్లందు మొత్తం ఏడు ఆర్‌టిసి డిపోలు ఉన్నాయి. సుమారు వెయ్యి బస్సుల వరకు నిత్యం రాకపోకలు సాగిస్తున్నాయి. ఉచిత ప్రయాణానికి ముందు అక్టోబర్, నవంబర్ నెలల్లో సగటున ఒక్కో నెల 35 లక్షల మంది ప్రయాణీకులు రాకపోకలు సాగించారు. ఉచిత ప్రయాణం అమల్లోకి వచ్చాక డిసెంబర్ తొమ్మిది నుంచి జనవరి 26వ తేదీ వరకు దాదాపు 48 రోజుల్లో మొత్తం రీజియన్ పరిధిలో 88 లక్షల మందికి పైగా ప్రయాణీకులు ఆర్‌టిసి బస్సుల్లో ప్రయాణించడం గమనార్హం. గతంలో 61 రోజుల్లో 71.62 లక్షల మంది ప్రయాణిస్తే.. ఉచిత పథకంతో కేవలం 48 రోజుల్లోనే 88.21 లక్షల మంది ప్రయాణించారు. గడిచిన 48 రోజుల్లో 46.24 లక్షల మంది మహిళా ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణం చేస్తే.. 41.97 లక్షల మంది పురుషులు రాకపోకలు సాగించారు. పురుషుల కంటే మహిళలు దాదాపు ఐదు లక్షల వరకు ప్రయాణం సాగించారు.

ఆక్యుపెన్సీతో పాటు ఆదాయం..

ఉచితంతో మహిళా ఆక్యుపెన్సీ రేషియో పెరగడంతో ఆర్‌టిసికి ప్రభుత్వం వైపు నుంచి ఆదాయం కూడా భారీగా పెరిగింది. కొందరు మహిళలు దాదాపు రెండు నెలలుగా రాష్ట్రంలోని అన్ని పుణ్యక్షేత్రాలు, సందర్శనీయ స్థలాలకు వెళుతున్నారు. లగ్జరీ, సూపర్ లగ్జరీ, రాజధాని వంటి బస్సుల్లో ప్రయాణించే వారు సైతం ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సుల్లో ప్రయాణిస్తుండటంతో ఈ బస్సులకు వచ్చే ఆదాయం భారీగా పెరుగుతోందని ఆర్‌టిసి అధికారులు తెలిపారు. ఖమ్మం జిల్లాలోని ఏడు ఆర్‌టిసి డిపోల్లో కేవలం మధిర భద్రాచలం తప్ప మిగిలిన ఐదు డిపోల పరిధిలోనూ పురుషుల కన్నా మహిళలే అధికంగా ప్రయాణించారు. గతంలో 61 రోజుల్లో మొత్తం ప్రయాణికుల నుంచి రూ.60 కోట్ల ఆదాయం వస్తే.. ఇప్పుడు 48 రోజుల్లో కేవలం పురుష ప్రయాణికుల నుంచి రూ.62 కోట్ల ఆదాయం రావడం గమనార్హం. ప్రభుత్వం వైపు నుంచి ఉచిత ప్రయాణికుల ద్వారా వచ్చే ఆదాయం అదనం.

తీర్థ యాత్రలు చేస్తున్నా...కల్యాణి, భువనగిరి

మేము గతంలో ఎప్పుడూ తిరగని పుణ్యక్షేత్రాలను ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఇప్పుడు దర్శించుకోగలుగుతున్నాం. ఇంతకుముందు ఎటైనా వెళ్లాలంటే నేను, ముగ్గురు పిల్లలు, నా భర్తకు.. మొత్తం ఐదుగురికి చార్జీలు భరించాల్సి వచ్చేది. ఇప్పుడు ముగ్గురం ఉచితంగా ప్రయాణిస్తున్నాం. ఎక్కడికి వెళ్లాలన్నా బస్సుల్లోనే ప్రయాణిస్తున్నాం. బస్సుల్లో ప్రయాణం వల్ల మహిళలకు సేఫ్టీ కూడా ఉంటుంది. మాతోపాటు మా బాబు, భర్త కూడా బస్సులోనే ప్రయాణం చేస్తున్నారు ఎప్పటికీ ఈ పథకాన్ని కొనసాగించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మహిళలందరి తరపున కోరుతున్నాను.

గిరిజనం బాధలు తీరేనా..?

- ఆదివాసీ పల్లెల్లో మౌలిక వసతులు కరువు
- పోడు భూములకు పూర్తిగా దక్కని పరిష్కారం
- భగీరథ వచ్చినా.. అందని తాగునీరు
- నేడు కేస్లాపూర్‌లో గిరిజన దర్బార్..
- హాజరుకానున్న మంత్రి సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆదివాసులు అధికంగా నివసించే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఇప్పటికీ వారిని మౌలిక వసతుల కొరత వెంటాడుతోంది. ఆదివాసుల జీవన స్థితిగతుల్లో మార్పులు రావడం లేదు. వారి అభ్యున్నతి కోసం ప్రత్యేకంగా సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటిడిఎ) ఉన్నా పరిస్థితులు ఏమీ మారడం లేదు. ఏండ్లుగా పోడు భూమిని నమ్ముకొని జీవనం సాగిస్తున్న ఆదివాసీ గిరిజనులకు ఆ భూమిపై సంపూర్ణ హక్కులు లభించడం లేదు. గత ప్రభుత్వం కొందరికి హక్కు పత్రాలు పంపిణీ చేసినా.. అనేక మందిని విస్మరించింది. మరోపక్క ఏజెన్సీ ప్రాంతంలో రోడ్లు, వాగులపై వంతెనలు లేక అత్యవసర పరిస్థితిలో ఆస్పత్రికి వెళ్లలేని పరిస్థితి. సోమవారం కేస్లాపూర్‌లో గిరిజన దర్బార్ జరగనుంది. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దనసరి అనసూయ(సీతక్క) హాజరుకానున్న నేపథ్యంలో ఇప్పటికైనా తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని గిరిజనులు ఆశిస్తున్నారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1509 గ్రామ పంచాయతీలు ఉండగా ఇందులో సగానికి పైగా పంచాయతీలు ఏజెన్సీ ప్రాంతంలో ఉన్నాయి. గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రత్యేకంగా ఐటిడిఎ ఏర్పడినా.. గిరి గ్రామాల్లో ఇప్పటికీ మౌలిక సదుపాయాలు కల్పించడం లేదు. ఇప్పటికీ అనేక పల్లెలకు రోడ్డు మార్గం లేదు. వాగులు, వంకలు దాటుతూ అతి కష్టం మీద సమీప గ్రామాలు, మండల కేంద్రాలకు వెళ్తుంటారు. వర్షాకాలంలో వాగులు పొంగిపొర్లడంతో వాటిని దాటలేక అనేక మంది గర్భిణీలు మార్గమధ్యలోనే ప్రసవించిన ఘటనలున్నాయి. గిరిజన దర్బార్ సందర్భంగా గత ప్రభుత్వం జిల్లాలో రూ.340కోట్లతో గ్రామాలకు కనెక్టివిటీ రోడ్లను నిర్మిస్తామని హామీనిచ్చినా.. పూర్తిస్థాయిలో నెరవేరలేదు.

పోడుకు దక్కని పరిష్కారం..!

ఆదివాసీ గిరిజనుల జీవనాధారమైన పోడు భూములకు సంపూర్ణ హక్కుల లభించడం లేదు. గత ప్రభుత్వం 47వేల హక్కుపత్రాలు పంపిణీ చేస్తున్నట్టు ప్రకటించింది. కానీ, ఉమ్మడి జిల్లాలో 66వేల మందికి పైగా లబ్ధిదారులు 1.46 లక్షల ఎకరాల కోసం దరఖాస్తులు చేసుకోగా.. సుమారు 20 వేల మందికి మాత్రమే పంపిణీ చేసినట్టు తెలుస్తోంది. మరోపక్క హక్కుపత్రాల్లో తప్పులు దొర్లడంతో లబ్ధిదారుల పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. అనేక మందికి ఎకరాల్లో ఉన్న భూమిని గుంటల్లో పేర్కొనడంతో పంట రుణాలు, రైతుబంధు వంటి పథకాలు పొందలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటితో పాటు జీఓ 3ని యథావిధిగా అమలు చేయాలని ఆదివాసులు డిమాండ్ చేస్తున్నారు. టైగర్ జోన్ పేరిట గిరి గ్రామాలను ఇతర చోటకు తరలించారని.. వాటిలో కనీస సౌకర్యాలు కల్పించలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు.

తాగునీటికి తప్పని తిప్పలు..!

గత ప్రభుత్వం ఇంటింటికీ శుద్ధనీటిని అందించేందుకు మిషన్ భగీరథ పథకాన్ని తీసుకొచ్చింది. మారుమూల పల్లెల్లో కూడా ట్యాంకులు నిర్మించి పైప్‌లైన్లు వేసి ఇంటింటికీ నల్లాలు బిగించారు. కానీ నీటి సరఫరాలో అంతరాయం కలుగుతూనే ఉంది. అనేక పల్లెల్లో రెండు, మూడ్రోజులకు ఒకసారి నీటి సరఫరా జరుగుతుండటంతో గిరిపుత్రులు ఇప్పటికీ చెలిమెలు, వాగులు, బావుల మీదనే ఆధారపడాల్సి వస్తోంది. తరుచూ తాగునీటి సమస్య తలెత్తుతోందని ఇంద్రవెల్లి, ఉట్నూర్‌కు చెందిన ప్రజాప్రతినిధులు పలుమార్లు జడ్‌పి సమావేశాల్లో ప్రస్తావించినా సమస్య పరిష్కారం కావడం లేదనే విమర్శలున్నాయి. మరోపక్క చారిత్రక సంపదకు నిలయంగా ఉన్న గోండు రాజుల కోటలు ఆనవాళ్లు కోల్పోతున్నాయని వాటిని అభివృద్ధి చేయాలని, ఆదివాసీ పుణ్యక్షేత్రాలను పరిరక్షించాలని ఆదివాసీ నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ఆదివాసీ గిరిజనుల ఆకాంక్షలు నెరవేర్చాలి

పూసం సచిన్, ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ గిరిజనులు కొత్త ప్రభుత్వంపై అనేక ఆశలు పెట్టుకున్నారు. గత ప్రభుత్వం వీరి అభివృద్ధికి అనేక హామీలిచ్చి విస్మరించింది. విద్య, వైద్యం, ఇతర మౌలిక వసతులపై దృష్టిసారించాలి. ఐటిడిఎ కేంద్రంగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రితో పాటు ఇంజినీరింగ్ కళాశాల, యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో బెల్టు షాపులు మూసేయాలి. ఆదివాసీ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి.

సిఎం రేవంత్‌రెడ్డితో బొంతు రామ్మోహన్ భేటీ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని జిహెచ్‌ఎంసి మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ భేటీ అయ్యారు. ఆదివారం హైదరాబాద్‌లోని సిఎం నివాసంలో ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. పలు అంశాలపై చర్చించారు. ఈ భేటీలో సిఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. సిఎంను కలవడంతో ఆయన బిఆర్‌ఎస్‌ను వీడుతారనే ప్రచారం జరుగుతున్నది.

మేడారం జాతర ట్రస్ట్ బోర్డు నియామకం

- జాతర అధ్యక్షులుగా అర్రెం లచ్చుపటేల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గిరిజనుల ఆరాధ్యదైవం ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క-సారలమ్మ మహా జాతరకు సంబంధించి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జాతర ఏర్పాట్లను పర్యవేక్షించడానికి మేడారం జాతర ట్రస్ట్ బోర్డు కమిటీ మెంబర్లను నియమించింది. 14 మందితో కూడిన కమిటీని నియమిస్తూ దేవాదాయ శాఖ కమిషనర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. మేడారం ట్రస్ట్‌బోర్డ్ ఉత్సవ కమిటీ చైర్మెన్‌గా అర్రెం లచ్చుపటేల్, సభ్యులుగా మిల్కూరి ఐలయ్య, కోడి గోపాల్, గంగెర్ల రాజరత్నం, కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, యాప అశోక్, పోరిక నారాయణ సింగ్, ముంజాల బిక్షపతిగౌడ్, సుంచ హైమావతి, చామర్తి కిషోర్, కోరం అబ్బయ్య, ఆలం శశిధర్, వద్దిరాజు రవిచంద్ర, అంకం కృష్ణస్వామి, ఎక్సాఫిషియో మెంబర్‌గా సిద్దబోయిన జగ్గారావు నియమితులయ్యారు. ఈ నెల 15వ తేదీన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రి డాక్టర్ సీతక్క సమక్షంలో ట్రస్ట్‌బోర్డు అధ్యక్షులు, కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేయనున్నారు.

వేర్వేరు చోట్ల నీట మునిగి నలుగురు బాలురు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వేర్వేరు చోట్ల జరిగిన ప్రమాదాల్లో నీట మునిగి నలుగురు బాలరు మృతి చెందారు. మహబూబాబాద్ జిల్లాలో ఇద్దరు, జయశంకర్-భూపాలపల్లి జిల్లాలో ఇద్దరు బాలురు మృత్యువాత పడ్డారు.

మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండలంలోని అమ్మాపురం గ్రామంలో ఆదివారం సెలవు దినం కావడంతో ఈతకు వెళ్లి ఇద్దరు బాలురు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి ప్రాణం కోల్పోయారు. గ్రామంలోని పెద్ద చెరువులో ఈతకు వెళ్లి గంధం యాకూబ్ (14), కిన్నెర జంపన్న (12) నీటిలో మునిగి చనిపోయారు.

జయశంకర్-భూపాలపల్లి జిల్లా మల్హర్‌రావు మండల కేంద్రమైన తాడిచెర్లలో చెరువులో పడి ఇద్దరు చిన్నారులు మృతిచెందారు. బొంతల రాజు-అనూష దంపతుల కుమారులు అరుణ్ (12), కార్తీక్ (10). ఆదివారం పాఠశాలకు సెలవు ఉండటంతో మేకలను మేపేందుకు గ్రామ శివారుకు వెళ్లారు. అక్కడ ప్రమాదవశాత్తు పెంజేరువు చెరువులో పడి మృతిచెందారు. ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు చిన్నారులు మృతిచెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కాటారం సిఐ నాగార్జునరావు, కొయ్యూర్ ఎఎస్‌ఐ కుమారస్వామి సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అరుణ్ 6వ, కార్తీక్ 4వ తరగతి ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. పిల్లలిద్దరినీ విగతజీవులుగా చూసి తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు. విషయం తెలుసుకున్న శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు ఘటనాస్థలానికి వచ్చి తల్లిదండ్రులను ఓదార్చారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

అచ్చేదిన్ అంటూ కుట్రలు..

- మేకిన్ ఇండియా పేరుతో మోసం
- బిజెపి కార్పొరేట్, మతతత్వ విధానాలను ప్రతిఘటించాలి
- కార్మిక సంఘాల సదస్సులో పాలడుగు భాస్కర్
- ఐఎస్ సదన్ చౌరస్తా వరకు ర్యాలీ, మానవహారం

సదస్సులో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని మోడీ సర్కార్ అచ్చేదిన్ ఆయేగా అంటూ ప్రజలను మోసం చేస్తోందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. ఆదివారం సంతోష్‌నగర్‌లోని సిఐటియు హైదరబాద్ సౌత్ జిల్లా కార్యాలయంలో సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. అదేవిధంగా ఐఎస్ సదన్ చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లి మానవహారం చేపట్టారు. సమ్మె సన్నాహకం కోసం బైక్ ర్యాలీకి 10 రోజుల కిందటే దరఖాస్తు చేసుకుంటే చివరి నిమిషంలో రద్దు చేయడంతో నాయకులకు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. చివరికి ఐఎస్ సదన్ చౌరస్తా వరకు ర్యాలీగా వెళ్లి మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా సదస్సులో భాస్కర్ మాట్లాడుతూ.. ఈ నెల 16న నిర్వహించే సమ్మెలో నగరంలోని వివిధ రంగాల కార్మికులు భాగస్వాములు కావాలన్నారు. బిజెపి ప్రజావ్యతిరేక విధానాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. బిజెపి కార్పొరేట్ మతతత్వ విధానాలను ధిక్కరిస్తూ ప్రతిఘటనకు పూనుకోవాలన్నారు. పదేళ్ల కాలంలో రైతాంగ, కార్మిక, ప్రజల సమస్యలు పరిష్కరించలేదన్నారు. భారత్ వెలుగు పోతుంది.. అచ్చేదిన్ ఆయేగా.. ఆత్మ నిర్భయ భారత్, విశ్వగురు, మేకిన్ ఇండియా వంటి మోసపూరిత నినాదాలు ఇచ్చినా ప్రజలకు ఒరిగింది ఏమీ లేదన్నారు. 30 నుంచి 56 శాతం ధరలు పెరిగాయని, పెట్రోలు ఉత్పత్తులపై కేంద్ర ప్రభుత్వం పన్నుల వాటాను 243శాతం పెంచిందన్నారు. మోడీ ప్రభుత్వ విధానాల వల్ల మధ్యతరగతి ప్రజల జీవితాలు అతలాకుతలంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు.

కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు, సహజ వనరులను కార్పొరేట్ల పరం చేస్తున్నదన్నారు. వ్యూహాత్మక అమ్మకాల పేరుతో ప్రభుత్వరంగ సంస్థలలో వంద శాతం వాటాలను తెగ నమ్ముతున్నదన్నారు. నేషనల్ మానిటైజేషన్‌పైప్లైన్ పాలసీ ద్వారా మౌలిక వసతులను లీజుల పేరుతో ప్రయివేటీకరిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మిక చట్టాలు మార్చి వాటి స్థానంలో కార్మిక కోడ్‌లను తీసుకొచ్చిందని చెప్పారు. తిరిగి 12 గంటల పని దినాన్ని అమలులోకి తీసుకరావడానికి కుట్రలు చేస్తోందన్నారు. కాంట్రాక్ట్ లేబర్ విధానాన్ని అన్ని రంగాల్లో మరింత పెంచి శ్రమ దోపిడీకి గురిచేస్తుందన్నారు. దీన్ని వ్యతిరేకిస్తూ ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మె పారిశ్రామిక బంద్‌ను విజయవంతం చేయాలని సిఐటియు హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి ఎం.శ్రావణ కుమార్ కోరారు.

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కె యాదగిరి మాట్లాడుతూ.. భారత రాజ్యాంగాన్ని, అందులో పొందుపరిచిన లౌకికవాదాన్ని తారుమారు చేస్తూ హిందూ రాజ్యస్థాపన లక్ష్యంగా ఆర్‌ఎస్‌ఎస్ తన ఎజెండాను ముందుకు తీసుకెళ్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. నిరుద్యోగం, ధరలు పెరుగుదల, పేదరికం, ఆకలి మొదలైన కీలక అంశాలను ప్రజల దృష్టి నుంచి మరల్చడానికి ఆర్‌ఎస్‌ఎస్ నేతృత్వంలోని మతతత్వ శక్తులు రామాలయం ప్రారంభోత్సవం, అక్షింతల కార్యక్రమాలతో ముందుకొచ్చారని చెప్పారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె ఈశ్వర్‌రావు, నాయకులు విఠల్, జంగయ్య, కోటయ్య, రామ్ కుమార్, ఎస్ కిషన్, సురేష్, బాబర్ ఖాన్, సరూప, నాగేశ్వరరావు, సలీం, గౌస్, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

మేడారం జాతర పనులన్నీ పూర్తి

- 23న రాష్ట్రపతి, సిఎం, గవర్నర్ రాక
- మంత్రి డాక్టర్ దనసరి సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మేడారం మహా జాతరకు అన్ని ఏర్పాట్లు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసినట్టు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి స్త్రీ-శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క తెలిపారు. ఆదివారం ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క సారలమ్మ వన దేవతల ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. మేడారం జాతరకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిందని, సందర్శకులు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉన్నదని అన్నారు. ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అధికారులు అన్ని విధాలుగా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. జాతరకు వచ్చే మహిళలకు ఉచిత బస్ ప్రయాణం కల్పిస్తుందని, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. ఈ నెల 23న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గవర్నర్‌తో పాటు రాష్ట్రపతి వచ్చే అవకాశం ఉందని, సందర్శకులకు దర్శనం కోసం లెన్ల సంఖ్యను పెంచినట్టు చెప్పారు. ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు సమ్మక్క, సారలమ్మ జాతర జరగనుందని చెప్పారు. జంపన్నవాగుపై స్నాన ఘట్టాలు, క్యూ లైన్లు, తాగునీరు, రోడ్లు, బస్టాండ్ పనులు పూర్తయ్యాయన్నారు. అనంతరం వెంకటాపూర్ మండల పాలంపేట గ్రామంలో రూ.90 లక్షలతో నూతనంగా నిర్మిస్తున్న వృద్ధాశ్రమ భవన నిర్మాణ పనులను మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) శ్రీజ, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

కెసిఆర్ ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలి

- అప్పుడే నల్లగొండకు రావాలి
- లేకుంటే బిఆర్‌ఎస్ సభను అడ్డుకుంటాం : మంత్రి కోమటిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో దక్షిణ తెలంగాణకు తీరని అన్యాయం చేసిన కెసిఆర్.. ఏ మొహం పెట్టుకుని ఇప్పుడు నల్లగొండకు వస్తున్నారని, క్షమాపణ చెప్పాకే రావాలని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు, ఈ నెల 13న నిర్వహించే బిఆర్‌ఎస్ సభను అడ్డుకుంటామని, కెసిఆర్ దిష్టిబొమ్మలతో నిరసన తెలుపుతామన్నారు. ఆదివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని తన క్యాంప్ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సిఎం కెసిఆర్ నల్లగొండ జిల్లాకు చేసిందేమీ లేదన్నారు. ప్రాజెక్టుల పేరుతో రాష్ట్ర ప్రజలను మోసం చేశారని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ సిఎం జగన్ మోహన్ రెడ్డితో కుమ్మక్కై రాష్ట్రం నీళ్లను ఆంధ్రప్రదేశ్‌కు ధారాదత్తం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్‌ఎల్‌బిసిని కుర్చీ వేసుకొని పూర్తి చేస్తానన్న కెసిఆర్ మాట తప్పారని విమర్శించారు. పాలమూరు రంగారెడ్డి, ఎస్‌ఎల్‌బిసి ప్రాజెక్టులను పట్టించుకోకుండా దక్షిణ తెలంగాణను ఎడారిగా మార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్ గురించి మాట్లాడే అర్హత ఎమ్మెల్యేలు కెటిఆర్, హరీశ్‌రావుకు లేదన్నారు. తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజాయోగ్యమైందని, ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో అన్ని రంగాలకు సమప్రాధాన్యతనిచ్చామని చెప్పారు. సభలో నల్లగొండ ప్రజలకు క్షమాపణ చెప్పాకే కెసిఆర్ ప్రసంగించాలని డిమాండ్ చేశారు. కెఆర్‌ఎంబి ఫైళ్లపై సంతకం పెట్టిందే కెసిఆర్, హరీశ్‌రావు అని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే హక్కు ఎవరికీ లేదని అన్నారు. కాళేశ్వరం మేడిగడ్డపై చర్చా వేదికలో అందరూ పాల్గొనాలని కోరారు.

రాష్ట్ర చిహ్నం మారిస్తే ఊరుకోం

మాజీ ఎంపి వినోద్‌కుమార్

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర చిహ్నం నుంచి కాకతీయ తోరణం,చార్మినార్ గుర్తుల్ని తొలగిస్తే ఊరుకోబోమని మాజీ ఎంపి బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. దీనిపై ఆ జిల్లాలకు చెందిన మంత్రులు కొండా సురేఖ, సీతక్క స్పందించాలని డిమాండ్ చేశారు. ఆదివారంనాడిక్కడి తెలంగాణ భవన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ వ్యతిరేక శక్తుల డైరెక్షన్‌లో సిఎం రేవంత్‌రెడ్డి పని చేస్తున్నారని ఆరోపించారు. కాకతీయుల కాలంలో కాకతీయులు నిరుపేద ప్రజల కోసం పని చేశారనీ, 800 ఏండ్ల చరిత్రను కనుమరుగు చేసే కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ఈ రెండు చిహ్నాలు రాచరిక వ్యవస్థకు అద్దం పట్టేలా ఉన్నాయనడం సరికాదన్నారు. వాహన రిజిస్ట్రేషన్లకు 'టీజీ'గా మారుస్తామని ప్రకటించారనీ, ఉద్యమ సమయంలో అవే అక్షరాలు రాసినా, తమిళనాడు, త్రిపుర వంటి రాష్ట్రాల్లో 'టీజీ' అని ఉండటంతో తెలంగాణ స్టేట్‌గా 'టీఎస్' అని మార్పు చేయాల్సి వచ్చిందని వివరించారు. ఈ మార్పులపై ప్రభుత్వం వెనక్కి తగ్గకుంటే ప్రజలను, యువకులను ఏకం చేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

సామాజిక న్యాయం సమాధి

- ప్రమాదకర బిజెపిని ఎన్నికల్లో ఓడించాలి
- కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్‌వెస్లీ
- రాజ్యాంగ రక్షణ కోసం పూలే, అంబేద్కర్ జన జాతరలు
- కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు

సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాజ్యాంగంపై ప్రమాణం చేసిన బిజెపి నేతలు సామాజిక న్యాయాన్ని సమాధి చేస్తున్నారని, రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించడం ద్వారా రాజ్యాంగ హక్కులను రక్షించుకోవాలని కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. ఆదివారం ఖమ్మంలోని జిల్లా పరిషత్ మీటింగ్ హాల్‌లో కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సమావేశం ప్రారంభమైంది. తొలుత కెవిపిఎస్ జెండాను జాన్‌వెస్లీ ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్ల బిజెపి పాలనలో భారత రాజ్యాంగం ప్రమాదపుటంచుల్లో పడిందని, ఎన్నికల్లో ఆ పార్టీని ఓడించాలని, మనువాద విధానాలను మట్టిలో పాతరెయ్యాలని అన్నారు. రాజ్యాంగ మూలస్తంభాలను బిజెపి కూల్చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మతోన్మాదం, దేవుడు మనోభావాల పేరుతో పేదల హక్కులను హరిస్తున్నారని విమర్శించారు. కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తప్పెట్ల స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ.. బిజెపిని ఈ పార్లమెంట్ ఎన్నికల్లో అడ్డుకోకపోతే దేశాన్ని రక్షించుకోవడానికి ఎంతో కష్టపడాల్సి వస్తుందన్నారు. రాజ్యాంగ ధ్వంసాన్ని నిరోధించకపోతే దేశానికి, స్వాతంత్ర్యానికి ద్రోహం చేసినట్లే అన్నారు. న్యూస్‌క్లిక్‌పై దాడులు, మీడియాపై ఆధిపత్యం, జర్నలిస్టులపై కేసులు బిజెపి ప్రభుత్వ నిరంకుశత్వానికి నిదర్శనమని చెప్పారు. రాజ్యాంగ హక్కుల రక్షణ కోసం పూలే, అంబేద్కర్ జన జాతర ద్వారా దళితులను చైతన్యవంతం చేస్తున్నామన్నారు. సమావేశానికి కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమెల మాణిక్యం, పల్లెర్ల లలిత అధ్యక్షత వహించారు. సమావేశం ప్రారంభానికి ముందు సామాజిక, ప్రజాఉద్యమ అమరవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. సమావేశంలో కెవిపిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు నాగార్జున, నందిపాటి మనోహర్, అరూరి కుమార్, రాష్ట్ర సహాయ కార్యదర్శులు దయ్యపు రాధాకృష్ణ, తిప్పారపు సురేష్, దుర్గం దినకర్, కోట గోపి, మంద సంపత్, డి.రామ్మూర్తి, ఖమ్మం జిల్లా అధ్యక్షులు ముత్తమల ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు కొమ్ము శ్రీను, నకిరేకంటి చిరంజీవి, మట్టి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బుక్‌ఫెయిర్‌కు జనప్రవాహం

- పుస్తక ప్రియులతో కళకళలాడిన ప్రాంగణం
- సెలవుదినం కావడంతో పెరిగిన సందర్శకుల తాకిడి
- స్టాల్స్ వద్ద పుస్తకాల కొనుగోళ్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జాతీయ పుస్తక ప్రదర్శన పుస్తక ప్రియులతో నిండిపోతోంది. నచ్చిన పుస్తకాన్ని అక్కున చేర్చుకొని జ్ఞానాన్ని పొందడానికి పోటీపడుతున్నారు. డిజిటల్, ఆడియో రూపాల్లో కూడా పుస్తకాలు వస్తున్న తరుణంలో ముద్రిత పుస్తకాలకు ఆదరణ తగ్గలేదని హైదరాబాద్ జాతీయ బుక్ ఫెయిర్ నిరూపిస్తోంది. హైదరాబాద్‌లోని 36వ పుస్తక ప్రదర్శనకు సందర్శకుల తాకిడి పెరిగింది. ఆదివారం సెలవు దినం కావడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, నగరంలో ఆయా ప్రదేశాల నుంచి సందర్శకులు బుక్ ఫెయిర్‌కు పోటెత్తారు. పుస్తకాల పండుగ జరిగే ప్రజాగాయకుడు, యుద్ధనౌక గద్దర్ ప్రాంగణమైన ఎన్‌టిఆర్ స్టేడియం సందర్శకులతో కిటకిటలాడింది.

నగరం నడిబొడ్డున తెలంగాణ కళాభారతి (ఎన్‌టిఆర్ స్టేడియం)లో హైదరాబాద్ బుక్ ఫెయిర్ ఆధ్వర్యంలో జరుగుతున్న పుస్తకాల పండుగ మూడో రోజుకు చేరుకుంది. చిన్నారుల నుంచి పండు ముసలి వాళ్లు పుస్తకాలపై అభిమానాన్ని చాటుకుంటున్నారు. బుక్ ఫెయిర్‌కు ప్రతి రోజూ దాదాపు 50 నుంచి 60 వేల మందికిపైగా సందర్శకులు వస్తుండగా.. ఆదివారం ఒక్కరోజే దాదాపు లక్ష మందికిపైగా సందర్శకులు వచ్చారని, బాల సాహిత్యం నుంచి టెక్నాలజీ రంగానికి సంబంధించిన అన్ని పుస్తకాలు ఒకే దగ్గర ఉండటంతో పుస్తకాల కొనుగోలుకు ఆసక్తి చూపిస్తున్నారని నిర్వాహకులు తెలిపారు.

స్టాల్స్ వద్ద పుస్తకాల కొనుగోళ్లు

సాహితీవేత్తలు, పుస్తక ప్రియులు, యువతీ యువకులు, పిల్లలు, మహిళలు తమకు కావాల్సిన పుస్తకాలను కొనుగోలు చేయడానికి ఆసక్తి కనబర్చారు. పుస్తక ప్రదర్శనలో వివిధ సంస్థలు ముఖ్యంగా నవతెలంగాణ బుక్ హౌస్, నవచేతన, విశాలాంధ్ర, ఎమెస్కో, తెలంగాణ పబ్లికేషన్స్, తెలుగు బుక్ హౌస్‌తోపాటు హైదరాబాద్, ముంబయి, ఢిల్లీ తదితర రాష్ట్రాలకు చెందిన పబ్లికేషన్స్ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ల్లో కొనుగోలు కోసం పుస్తక ప్రియులు పోటీ పడ్డారు. ముఖ్యంగా నవతెలంగాణ వంటి స్టాల్స్‌లో అలిశెట్టి ప్రభాకర్ కవిత, అమ్మ, మా అమ్మమ్మ సుబ్బలక్ష్మి, ఇంగ్లీష్ టీచర్, రంగనాయకమ్మ రచనలు స్వీట్ హోమ్, ఇదండి మహాభారతం, సిక్రెట్(ఐబీడీ పబ్లిషర్స్), చేగువేరా(హెచ్‌బీటీ), అంపశయ్య నవీన్ పుస్తకాలతో పాటు ఆధ్యాత్మికం, విప్లవం, పర్సనాల్టీ డెవలప్‌మెంట్ వంటి పుస్తకాల కొనుగోలుకు మక్కువ చూపుతున్నారు.

పిల్లలతో పుస్తకాలు చదివించాలి

సింగారావు, ప్రభుత్వ బ్యాంకు ఉద్యోగి, నిజామాబాద్

పిల్లలతో పుస్తకాలు చదివించాలి. ముఖ్యంగా సోషలిజం, కమ్యూనిజం వంటి పుస్తకాలు చదివించడం ద్వారా వారు సమాజాన్ని అర్థం చేసుకోవడంతోపాటు ప్రశ్నించేతత్వాన్ని అలవర్చుకుంటారు. పిల్లల్లో కేరళ రాష్ట్రం మాదిరిగా కమ్యూనిజం, సోషలిజం పట్ల అవగాహన కల్పించాలి. కారల్ మార్క్స్, ఆర్‌ఎస్‌ఎస్ లోగుట్టు, కాన్షీరాం వంటి పుస్తకాలు కొనుగోలు చేశా.

ఆరు నెలలకోసారి బుక్ ఫెయిర్ నిర్వహించాలి

జూపూడి సుందర్ రావు, అడ్వొకేట్, ఎల్బీనగర్

టెక్నాలజీ యుగంలో కొట్టుకుపోతున్న తరుణంలో ఇలాంటి బుక్‌ఫెయిర్‌లు ఎంతో ఉపయోగపడతాయి. ఏడాదికోసారి కాకుండా ఆరు నెలలకోసారి బుక్ ఫెయిర్ నిర్వహించాలి. పుస్తకాలు మనిషి జీవితంలో ఒక భాగం. పెద్దలతో కలిసి పిల్లలు చదవాలి.

సమాచారానికి సంకెళ్లు

- పబ్లిక్ డొమైన్‌లో అర్ధ సత్యాలు, అసత్యాలు
- తెలంగాణ సమాచార కమిషన్ ఖాళీ
- ఏడాదిగా భర్తీ కాని పోస్టులు
- కోర్టు ఆదేశించినా... నిరాశే
- కాంగ్రెస్ సర్కార్ దృష్టి పెట్టాలని వినతుల వెల్లువ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమాచారానికి గత ప్రభుత్వం సంకెళ్లు వేసింది. పబ్లిక్ డొమైన్‌లో అర్ధ సత్యాలను, అసత్యాలను మాత్రమే ఉంచింది. కింది స్థాయి నుంచి మొదలుకొని ఉన్నతాధికారి వరకు ఏ కార్యాలయానికెళ్లి సమాచారమడిగినా మాకేం తెలియదంటూ తప్పించుకొని తిరిగారు. ఆర్‌టిఐ యాక్ట్ 2005 ప్రకారం సమాచారం ఇప్పించాలని స్టేట్ ఇన్‌ఫర్మేషన్ కమిషన్ (ఎస్‌ఐఐ)కు వెళ్లిన వారికి అక్కడా మొండి చేయే ఎదురైంది. ఫిబ్రవరి 2023 నుంచి ముఖ్య సమాచార కమిషనర్‌తో పాటు ఆరుగురు కమిషనర్లను ప్రభుత్వం భర్తీ చేయలేదు. ఫలితంగా పెండింగ్ కేసుల సంఖ్య 12 వేలకు పెరిగింది. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం సమాచార కమిషన్‌పై దృష్టి సారించాలని వినతులు వెల్లువెత్తుతున్నాయి. దేశభద్రత, రక్షణకు సంబంధించిన అతి ముఖ్యమైన సమాచారం తప్ప ప్రభుత్వానికి చెందిన సమాచారమంతా ప్రజలకు అందుబాటులో ఉండాలని 2005లో సమాచార హక్కు చట్టాన్ని తీసుకొచ్చారు. అయితే గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం దీనిపై అనధికారికంగా నిషేధం విధించింది. ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సమాచారాన్ని వాటి సైట్లలో అరకొర మాత్రమే ఉంచి చేతులు దులుపుకుంది. కీలక మైన జిఒలు, ఒప్పందాలు, ఇతర ముఖ్యమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచలేదు, అడిగినా అధికారులు ఇవ్వలేదు. సంబంధిత ఉద్యోగులనడిగితే హెచ్‌ఒడిని అడగమని, హెచ్‌ఒడి అడిగితే తమ శాఖాధిపతిని అడగమని, చివరికి పంచాయితీ అక్కడికెలితే నేరుగా ఇవ్వడం కుదరదు, ఆర్‌టిఐ ద్వారా తీసుకోమని చెప్పడం తంతుగా మారిపోయింది. సమాచారాన్ని ప్రజలకు అందుబాలో ఉంచకూడదన్నదేమో గానీ ప్రభుత్వం గత సమాచార కమిషన్ను నిర్వీర్యం చేసింది. నిధులు కేటాయించకపోవడం, కమిషనర్లను భర్తీ చేయకపోవడం లాంటి చర్యలతో శాఖ పట్ల ప్రజలకు విసుగొచ్చే చర్యలకు పాల్పడింది. సమాచార కమిషన్‌లో స్టేట్ చీఫ్ ఇన్‌ఫర్మేషన్ కమిషనర్‌తో పాటు ఆరుగురు కమిషనర్లు ఉంటారు. గత ఫిబ్రవరి నుంచి ఆ పదవులు ఖాళీగా ఉన్నాయి. ఇందుకు సంబంధించి పలు స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు కోర్టు తలుపు తట్టినా రేపు, మాపు అంటూ తప్పించుకుంది. కోర్టు మొట్టికాయలు వేయడంతో గతేడాది ఆగస్టు 4న సమాచార కమిష్‌నర్ల భర్తీకి సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేయగా 285 మంది ధరఖాస్తు చేసుకున్నారు. ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకులు, మరో క్యాబినెట్ మంత్రితో కూడిన కమిటీ కమిషన్‌ను నియమిస్తుంది. అప్పటి సిఎం కెసిఆర్ భర్తీకి సంబంధించి చొరవ తీసుకోకపోవడంతో ప్రక్రియ ముందుకు సాగలేదు. ఈ లోపు అసెంబ్లీ ఎన్నికలు రావడంతో కెసిఆర్ స్థానంలో రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టింది. కొత్త సర్కార్ సమాచార కమిషన్‌కు కమిషనర్లను నియమించి గాడిన పెట్టాలని పలువురు కోరుతున్నారు.

12 వేల కేసులు పెండింగ్

తెలంగాణ సమాచార కమిషన్‌లో 2017 నుంచి 12 వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో నాలుగు వేలు ఫిర్యాదులు కాగా, ఎనిమిది వేల అప్పీళ్లున్నాయి. పలు కేసుల్లో ఆర్డర్లిచ్చినా అధికారులు వాటిని అమలు చేయకపోవడంతో ఫిర్యాదుదారులు తిరిగి ఆర్టీఐ కమిషన్ తలుపుతడుతున్నారు.

పదేళ్లలో సమాచార వ్యవస్థ విధ్వంసమైంది

- పద్మనాభ రెడ్డి, ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్

కమిషనర్ల నియామకానికి సంబంధించి అప్పటి సిఎం కెసిఆర్‌ను కలిసేందుకు చాలా సార్లు ప్రయత్నించినా కుదురకపోవడంతో కోర్టు తలుపు తట్టాం. కోర్టు ఆదేశాల మేరకు నోటిఫికేషన్ ఇచ్చినా భర్తీని ఆలస్యం చేసింది. ఈలోపు ప్రభుత్వం మారడంతో ఇటీవల సిఎం రేవంత్ రెడ్డిని కలిసి కమిషనర్లను నియమించాలని కోరాం. సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి త్వరలోనే కమిషన్‌లోని ఖాళీలన్ని భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు.

'గురుకులం'లో విద్యార్థిని ఆత్మహత్య

- ఇమాంపేట బాలికల గురుకుల పాఠశాలలో ఘటన
- కుటుంబీకులు, బిఎస్‌పి, ప్రజాసంఘాల ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సూర్యాపేట మండలం ఇమాంపేటలోని సాంఘిక సంక్షేమ ఎస్‌సి బాలికల గురుకుల పాఠశాలలో శనివారం రాత్రి ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య కలకలం రేపింది. సూర్యాపేట పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన వెంకన్న, భాగ్యమ్మల కుమార్తె దగ్గుపాటి వైష్ణవి (17) గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం బైపిసి చదువుతోంది. శనివారం సాయంత్రం ఫేర్‌వెల్ డేలో వైష్ణవి పాల్గొన్నది. ఇదే సమయంలో తల్లికి వీడియో కాల్ చేసి ఫేర్‌వెల్ పార్టీ గురించి చెబుతూ.. చూపించింది. ఆ తర్వాత రాత్రి డార్మిటరీ హాల్‌కు వెళ్లింది. అయితే హాల్‌కు వెళ్లిన వైష్ణవి ఎంతకీ తిరిగి రాకపోవడంతో తోటి విద్యార్థినులు వెళ్లి చూడగా.. ఫ్యాన్‌కు ఉరివేసుకొని కనిపించింది. వెంటనే ఆమెను కిందకు దించి రక్షించేందుకు యత్నించారు. ఉపాధ్యాయులు, సిబ్బందికి సమాచారం ఇచ్చారు. కొన ఊపిరితో ఉన్న వైష్ణవిని అంబులెన్సులో ఏరియా ఆస్పత్రికి తరలించారు.

అక్కడ పరీక్షించిన వైద్యులు వైష్ణవి మృతిచెందినట్టు చెప్పారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు ఆస్పతికి చేరుకున్నారు. వారు మాట్లాడుతూ శనివారం సాయంత్రం పాఠశాలలో ఫేర్‌వెల్ డే ఫంక్షన్ వీడియో కాల్‌తో తమతో నవ్వుతూ మాట్లాడిందని, ఇంతలోనే ఇలా ఎలా జరిగిందంటూ కన్నీటి పర్యంతమయ్యారు. తమ కూతురు కొన్ని రోజుల క్రితం ఇంటికి వచ్చిన సమయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కలిసి ఎలా చదువుతున్నావని పలకరించారని చెప్పారు. హాస్టల్‌లో అన్నం బాగుండటం లేదని, రాళ్లు వస్తున్నాయని చెప్పగా.. అక్కడి నుంచే మున్సిపల్ చైర్‌పర్సన్ ఫోన్‌లో ప్రిన్సిపల్‌తో మాట్లాడారని చెప్పారు. అప్పటి నుంచే వైష్ణవిని వేధించారని.. హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. వైష్ణవి మృతదేహంపై గాయాలు ఉండటంతో తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేశారు.

కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

కళాశాల ఎదుట ఆందోళన

విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం గురుకుల కళాశాల ముందు కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళనకు దిగారు. పోలీసులు అక్కడికి చేరుకుని వారికి నచ్చజెప్పారు. ఎస్ఎఫ్ఐ, కెవిపిఎస్, ఐద్వా ఆధ్వర్యంలోనూ కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న జిల్లా అధికారులు, పోలీసులు ఆందోళన చేస్తున్న వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా వినకపోవడంతో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అక్కడికి వచ్చి ఆందోళనకారులతో మాట్లాడారు. కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, ఎక్స్‌గ్రేషియా చెల్లింపు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతామని హామీ ఇచ్చారు. అదేవిధంగా విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. మరోవైపు ఈ ఘటనపై ప్రిన్సిపల్ ఝాన్సీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.